

శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

## సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి : ఎమ్మెల్యే సామేల్

- శాలిగౌరారం ప్రాజెక్టు కుడి కాల్వకు నీటి విడుదల

శాలిగౌరారం జూన్ 10 : రైతుల సంక్షేమం కోసం విడుదల చేసిన సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సూచించారు. మంగళవారం శాలిగౌరారం ప్రాజెక్టు కుడి కాల్వ నుంచి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఆయకట్టు కింద సుమారు 6 వేల ఎకరాల్లో సాగు భూములకు నీరందనున్నట్లు చెప్పారు. రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు మండలంలోని పెర్కకొండారంలో నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎమ్మార్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఈ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, చామల వెంకటరమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### తీన్మార్ మల్లన్న చిల్లర రాజకీయాలు మానుకో ..

తీన్మార్ మల్లన్న చిల్లర రాజకీయాలు మానుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సూచించారు. తను లిక్కర్ వ్యాపారులతో మాట్లాడినట్టు వైరల్ అయిన వీడియోపై మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను అలాంటి వ్యక్తిని కాదని తెలిపారు. తనపై తీన్మార్ మల్లన్నలాంటి కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

## సీలింగ్ భూములకూ పట్టాలు : కలెక్టర్ త్రిపాఠి

మర్రిగూడ, జూన్ 10 : గతంలో రైతులకు ఇచ్చిన సీలింగ్ భూములు సాగుకు యోగ్యంగా ఉన్నట్లయితే వాటికి పట్టాలు అందిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. భూభారతి చట్టం అమలులో భాగంగా మంగళవారం మండలంలోని ఖుదాభక్షపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరై రైతుల సమస్యలను తెలుసుకున్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములున్నట్లయితే రైతులే స్వచ్ఛందంగా నాలా చేయించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. ఓపీ, ఇన్‌పేషెంట్, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఆర్ఐలు జవహర్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నల్లగొండ, జూన్ 10 : విద్యార్థుల నమోదుపై దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ అమిత్‌నారాయణ, డీఈవో భిక్షపతి, ఆర్డీవో రమణారెడ్డి పాల్గొన్నారు.

## జిల్లాలో మూడు రకాల ఎస్‌హెచ్‌జీలు

- డీఆర్డీవో పీడీ శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ, జూన్ 10 : జిల్లాలో మూడు రకాల ఎస్‌హెచ్‌జీల(స్వయం సహాయక సంఘాలు)ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్డీవో పీడీ శేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సెర్ప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కిశోర బాలికలు, 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వేర్వేరుగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా 36 పరస్పర సహకార సంఘాలే ఏర్పాటు చేశామని, వారికి జిల్లాలో మూడు బృందాలు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది బ్యాంక్ లింకేజ్ రుణాలు సుమారు రూ.1,090కోట్లు, డీఆర్డీవో నుంచి రూ.144కోట్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నిరుడు రూ.1,200 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చామని, వాటిలో 68 శాతం వసూలు చేశామని స్పష్టంచేశారు.

## తాను మరణిస్తూ ఏడుగురికి అవయవదానం

ఖైరతాబాద్, జూన్ 10 : తాను మరణిస్తూ ఓ యువకుడు ఏడుగురికి అవయవదానం చేశాడు. జీవన్‌దాన్ నోడల్ అధికారి శ్రీభూషణ్‌రాజు తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం హనుమాన్‌పేటకు చెందిన రాలపల్లి రాజు(24) ఈ నెల 6న బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాజును కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 9న బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టత వివరించగా అందుకు అంగీకరించారు. రాజు శరీరం నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, రెండు మూత్రపిండాలు, కార్నియాలు, గుండె సేకరించారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

చౌటుప్పల్, జూన్ 10 : మండల వ్యాప్తంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ సతీశ్ మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**ఇంటర్ మీడియట్ మెమో పోయినది**
**దొంతగాని రవిగౌడ్,** S/o. వెంకన్న, చిలుకూరు (గ్రా), (మం), సూర్యాపేట (జిల్లా), నా యొక్క ఇంటర్ మీడియట్ (TOSS) మెమో చిలుకూరు తహశీల్దార్ ఆఫీస్ దగ్గరలో పోయినది. మెమో నెం.14063, HT No.-1830353006, దొరికినవారు సంప్రదించగలరు. 9705623006.
NLG

**పట్టాదారు పాస్‌బుక్ పోయినది**
**పొంగుబల యల్లమ్మ,** W/o. అంజయ్య, R/o.H.No. 5-93, కాచారం గ్రామం, గుర్రంపోడు (మం), నల్లగొండ (జి), నా యొక్క పట్టాదారు పాస్ బుక్ నెం.T28100230134 కాచారం నుండి గుర్రంపోడుకు ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర||7569169048.
NLG

**లింక్ డాక్యుమెంట్స్ పోయినవి**
**నేను గంగాపురం జంగయ్య,** S/o. దేవయ్య, గ్రా|| సంగెం, మం||వలిగొండ (నల్లగొండ) యాదాద్రి భువనగిరి జిల్లా, నాకు చౌటుప్పల్‌లో సర్వే నెం.313లో ప్లాట్ నెం.8లో 214 గజాల ప్లాటు ఉంది. నేను చౌటుప్పల్ నుండి సంగెం వెళ్లేదారిలో డాక్యుమెంట్ నెం.2343/2000 మరియు 492/1999 నెంబర్ గల రెండు లింకు డాక్యుమెంట్స్ పోయినవి. దొరికినవారు సంప్రదించగలరు. సెల్:9705480217.

**CHANGE OF NAME**
Mohammad Ayesha Begum, W/o. Mohammad Kutubuddin, my age is 36 years, housewife, R/o. H.No.6-152/3, Village: Bibinagar, Mandal Bibinagar, District: Yadadri Bhuvanagiri, you may notice that my Aadhaar card shows AYESHA BEGUM, but now it has been changed to MOHAMMAD AYESHA BEGUM.

**CHANGE OF NAME**
Mohammad Kutubuddin, S/o. Khaja Hasnuddin, age 37 years, driver, R/o.H.No. 6-152/3, Village: Bibinagar, Mandal: Bibinagar, District Yadadri Bhuvanagiri, Please note that my Aadhaar card shows KUTUBUDDIN, now it has been changed to MOHAMMAD KUTUBUDDIN.

**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638 |


# ‘అమ్మ మాట - అంగన్‌వాడీ బాట’ ప్రారంభం

- జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్



నల్లగొండలోని 3వ అంగన్‌వాడీ పరిధిలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, జూన్ 10 : ఐదేండ్లలోపు పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీలో చేర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17 వరకు నిర్వహిస్తున్న ‘అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గొల్లగూడ 3వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదుకావాలని, వారికోసం ప్రభుత్వం పలు పథకాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి, సీడీపీవో హరిత పాల్గొన్నారు.

### అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి, జూన్ 10 : మండల కేంద్రంలో ‘అమ్మ మాట–అంగన్‌వాడి బాట’ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు 3–5 ఏండ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### త్రిపురారంలో..

త్రిపురారం, జూన్ 10: స్థానిఆక అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బడిబాట కరపత్రాన్ని నాయబ్ తహసీల్దార్ శ్రీదేవి ఆవిష్కరించారు. ఆర్ఐ సైదులు, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రకుమార్, సీనియర్ అసిస్టెంట్ కల్పన, ఏఎన్ఎం లీల, అంగన్‌వాడీ టీచర్లు ఏలేశ్వరి, శైలజ, మంగమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సబిత

## రాజీమార్గంతో కేసుల పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి సబిత

రామన్నపేట, జూన్10 : రాజీ మార్గంతో కేసులు పరిష్కరిచుకోవాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సబిత సూచించారు. మంగళవారం స్థానిక సివిల్ కోర్టులో జరిగిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 14న మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామన్నపేట సర్కిల్ ఎస్ఐలు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ ముందు వైద్య బృందం

## పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర వైద్య బృందం

చిట్యాల, జూన్ 10: మండలంలోని వెల్మినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ వైద్య బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా వైద్యబృందం మాట్లాడుతూ కుష్టువ్యాధి రహిత సమాజం కోసం వైద్య సిబ్బందితోపాటు సమాజంలోని అందరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. ఆశలు, ఏఎన్ఎంలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీటీ డ్రగ్ ద్వారా పూర్తిగా నిర్మూలించటంతోపాటు అంగవైకల్యం రాకుండా చూడవచ్చునని తెలిపారు. కుష్టువ్యాధి సర్వేపై అవగాహన కల్పించి, ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటేశ్వరాచారి, శ్రీనివాసరెడ్డి, అరుణ, పీహెచ్‌సీ వైద్యాధికారి ఉబ్బు నర్సింహ్మ, భాగ్యానాయక్, హనీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

## దర్వేశిపురం ఆలయ ఈవోగా నాగిరెడ్డి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగిరెడ్డి

నల్లగొండ సిటీ, జూన్ 10 : కనగల్ మండల కేంద్రంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవస్థానం నూతన ఈవోగా అంబటి నాగిరెడ్డిని నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నాగిరెడ్డికి ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రంగౌడ్, జూనియర్ అసిస్టెంట్ ఉపేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయకు స్వాగతం పలికారు. కాగా, ఇప్పటివరకు ఈవోగా విధులు నిర్వహించిన జయరామయ్యపై ఆలయ నిర్వహణలో అలసత్వం పేరుతో బదిలీవేటు వేసినట్లు తెలుస్తున్నది.

### దరఖాస్తుల ఆహ్వానం

కట్టంగూర్, జూన్ 10: ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహ సంక్షేమ అధికారి గుజ్జుల శంకర్‌రెడ్డి మంగళవారం ప్రకటలో పేర్కొన్నారు. ఆసక్తి గల ఎస్సీ విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సర బోనాఫైడ్, ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9848729854 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### బీఆర్ఎస్ మున్సిపాలిటీ నూతన కన్వీనర్‌కు సన్మానం

చౌటుప్పల్, జూన్ 10 : మున్సిపాలిటీ బీఆర్ఎస్ కన్వీనర్‌గా బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి నియామకమయ్యారు. ఆయనను మంగళవారం పార్టీ నాయకులు సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, దయాకరాచారి, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పరమేశ్, నర్సింహ, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

### ఏజెన్సీల శిక్షణలో ఎంఈవోలు



దామరచర్ల : మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీనాయక్

దామరచర్ల, జూన్ 10 : విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనంలో ఏజెన్సీలు నాణ్యత పాటించాలని మండల విద్యాధికారి బాలాజీనాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నభోజన ఏజెన్సీలు, శానిటేషన్ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సైదానాయక్, బాలు, డీఆర్పీ గోవర్ధన్‌రెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

త్రిపురారం, జూన్ 10 : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన శిక్షణలో ఎంఈవో రవి మాట్లాడుతూ.. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి సైదిరెడ్డి, సీహెచ్ రవి, ఆర్పీ మధుమోహన్ పాల్గొన్నారు.

చందంపేట, జూన్ 10 : ఎంపీడీవో కార్యలయంలో నిర్వహించిన శిక్షణలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పంతులాల్ నాయక్, లోక్యానాయక్ మాట్లాడుతూ... పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు.

పెద్దవూర/చిట్యాల జూన్ 10 : పెద్దవూర, చిట్యాల మండల కేంద్రరాల్లో నిర్వహించిన శిక్షణలో ఎంఈవోలు రాము, సైదానాయక్ మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

### నేడు కేసీఆర్‌కు సంఘీభావం

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు

మిర్యాలగూడ, జూన్ 10 : కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు హాజరుకానున్నందున మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులంతా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆకుపచ్చ కండువాలతో హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ వద్దకు పెద్దఎత్తున వచ్చి కేసీఆర్‌కు సంఘీభావం తెలుపాలని కోరారు.

### అనుమతిలేని బడిని మూసేయాలి: ఎస్ఎఫ్ఐ

చౌటుప్పల్ , జూన్ 10 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆంబిటాస్ పాఠశాల ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలను నడిపిస్తూ బుక్స్, యూనిఫాం విక్రయిస్తున్నారని, అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తక్షణమే అనుమతిలేని పాఠశాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాశ్, కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

### బస్ చార్జీలు తగ్గించాలి : లింగంగౌడ్

మిర్యాలగూడ, జూన్ 10 : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను 20 శాతం పెంచడం దారుణమన్నారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఏనాడూ విద్యార్థులపై భారం మోపలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చార్జీలు పెంచి విద్యార్థులపై తీవ్ర భారం మోపిందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే బస్సు భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

### ‘కొమ్మినేని’ అరెస్టు హేయం

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టుల ధర్నా

మిర్యాలగూడ, జూన్ 10 : సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్టు హేయమైన చర్య అని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీనివాస్‌రావును అరెస్టు చేయడం, సాక్షి కార్యాలయంపై దాడిని నిరసిస్తూ మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పలువురు జర్నలిస్టులు ధర్నా చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం కక్షపూరిత విధానాలు అవలంబిస్తూ సాక్షి జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు హమీదుద్దీన్, అస్లాం, అయూబ్, లక్ష్మణ్, సునీల్, రామకృష్ణ, హరీశ్, రవి, నాగభూషణం, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సాంకేతిక లోపంతో నిలిచిన ‘జన్మభూమి’

నల్లగొండ సిటీ, జూన్ 10 : సాంకేతిక లోపం కారణంగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నల్లగొండ రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం నిలిచిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఇంజిన్‌లో లోపాన్ని గుర్తించి మరో ఇంజిన్ రప్పించారు. మధ్యాహ్నం తర్వాత తిరిగి రైలు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.

### కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి

నల్లగొండ సిటీ, జూన్ 10 : రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఒకరు మృతి చెందారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడేనికి చెందిన జాల వంశీ పేటీఎంలో పనిచేస్తూ డ్యూటీ నిమిత్తం రుదాక్షి తిలక్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎస్ఎల్‌బీసీ సమీపంలో హాలియా నుంచి నల్లగొండ వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వంశీ(22) మృతి చెందగా, తిలక్ తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



భూ నిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

## భూ నిర్వాసితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జూన్ 10: రిజర్వాయర్ల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. అంబాభవానీ, పెద్దగట్టు, నక్కలగండి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయి నిర్వాసితులైన 10 మంది రైతులకు రూ.13లక్షల విలువైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న వారికి పునరావాసం కోసం చింతపల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన ఆర్‌అండ్ఆర్ కాలనీ కోసం సేకరించిన భూమిని కోల్పోయిన 9 మంది రైతులకు ప్రభుత్వం నుంచి రూ.84లక్షల విలువ గల నష్టపరిహారం చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ భద్రు, ఈఈ నెహ్రూ నాయక్, రాములునాయక్, సత్యనారాయణ, సబ్ డివిజన్ యూనిట్–1 నీల, డీఎఫ్‌వో రాజశేఖర్, ఆర్డీవో రమణారెడ్డి, ఎఫ్‌డీవో సంగీత, ఎఫ్ఆర్‌వో భాస్కర్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూన్ 10 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సూచించారు. మండలంలోని రాజవరంలో మంగళవారం నిర్వహించిన లింగమంతులు–సౌడమ్మ జాతరలో పాల్గొని ఆయన పూజలు చేశారు. గ్రామస్థులంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు సన్మానించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బీవీ రమణరాజు, మాజీ సర్పంచులు పోలేపల్లి సైదమ్మఆంజనేయులు, నెమలి సునీతకృష్ణారెడ్డి, నాయకులు ఉన్నారు.

## వర్మీ కంపోస్టు తయారీతో పంచాయతీలకు ఆదాయం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూన్10 : వర్మీ కంపోస్టు తయారీపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి గ్రామపంచాయతీలకు ఆదాయాన్ని పెంపొందించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని కాటన్‌మిల్లులో పారిశుధ్యం, తడిచెత్త, పొడిచెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వర్మీ కంపోస్టు తయారీపై మండల పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, డీపీవో వెంకయ్య, డీఎల్‌పీవోలు శంకర్‌నాయక్, వెంకటేశ్వర్లు, ఎంపీడీఓలు చంద్రశేఖర్, జ్ఞానప్రకాశ్, జయలక్ష్మి, శ్రీనివాసరావు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గడువులోగా పనులు పూర్తి చేయాలి : సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, జూన్ 10 : భవిత కేంద్రం మరమ్మతు పనులు గడువులోగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గల భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి జరుగుతున్న పనులు పరిశీలించారు. రూ.4.30లక్షలతో భవిత కేంద్రంలో టాయ్‌లెట్లు, ఫ్లోరింగ్, ప్రహరీగోడ నిర్మాణం, తలుపులు, కిటికీలు, కరెంట్ పని, కలరింగ్ తదితర పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ పనులను సబ్ కలెక్టర్ పరిశీలించి ఈనెల 15లోగా పూర్తి చేయాలన్నారు. ఎంఈవో బాలూనాయక్, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఏఈ జగన్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- చిట్యాల మున్సిపల్ కమిషనర్

చిట్యాల, జూన్ 10 : వానకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను సూచించారు. మంగళవారం ఆయన మున్సిపల్ పరిధిలోని 2,9,10 వార్డుల్లోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తడి, పొడిచెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగులో మెళకువలు పాటించాలి : శాస్త్రవేత్తలు

త్రిపురారం, జూన్ 10: రైతులు సాగులో మెళకువలు పాటించి లాభాల బాటలో పయనించాలని మండలంలోని కంపసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శివప్రసాద్, సంధ్యారాణి సూచించారు. మంగళవారం మండలంలోని బెజ్జికల్‌లో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు చేయించాలని, రసాయనాలు ఎక్కువగా వాడకుండా పశువుల పేడ, గోమూత్రం వాడాలని, పంట మార్పిడి విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటిరెడ్డి, ఏఈవో స్వాతి, రైతులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం పెంపు : హేమంత్‌కుమార్

కొండమల్లేపల్లి, జూన్ 10: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తనయుడు హేమంత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువుల సంత సమీపంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శరీర దారుఢ్యం పెంపుతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అరవింద్, జైశంకర్, హబీబ్, రమేశ్, వ సీం అక్రం, పవన్‌కుమార్, అనిల్, ఓంప్ర కాశ్, సాయిఅమృత్, విశ్వాస్, సాయి శంకర్, అరవింద్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కూతురు లక్ష్మారెడ్డి, ఇమామ్ కరీం

## హాకీలో ఉమ్మడి జిల్లాకు కాంస్యం : లక్ష్మారెడ్డి

నల్లగొండ రూరల్, జూన్ 10 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కాంస్య పతకం వచ్చినట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూతురు లక్ష్మారెడ్డి, ఇమామ్ కరీం మంగళవారం తెలిపారు. కాంస్య పతకం పొందడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

## యువకుడి ఆత్మహత్య

గుర్రంపోడ్, జూన్10 : మద్యం తాగొద్దని తల్లిదండ్రులు మందలించడంతో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన మండలంలోని తెరాటిగూడేనికి చెందిన నారబోయిన సురేందర్ (20) సోమవారం మద్యం తాగి ఇంటికి రాగా.. రోజూ ఇలా తాగి వస్తే ఆరోగ్యం దెబ్బతింటుందని తల్లిదండ్రులు అచ్చమ్మ, మల్లయ్య మందలించారు. దీంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి తమ బత్తాయి తోటలో చెట్లకు కొట్టే పురుగుల మందు తాగాడు. గమనించిన పరిసర రైతులు హుటాహుటిన 108వాహనంలో నల్లగొండ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.